
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 20 ఫిబ్రవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 19.0

మహాకుంభాభిషేకానికి శ్రీకారం



స్వామికి మొక్కుతున్న భక్తురాలు

యాగశాలలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు



అగ్ని ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు బుధవారం స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, రుత్వికుల వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై 10 గంటల వరకు కొనసాగింది.

● ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్

7

నెలవారంతో నాలుగోరోజు పూర్తి

పెద్దగట్టుపై భక్తుల రద్దీ



సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని పెద్దగట్టు జాతర సందర్భంగా లింగమంతులస్వామిని దర్శించుకునేందుకు భక్తుల రాక కొనసాగుతోంది. జాతరలో నాలుగో రోజైన బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారంతో జాతర పరిసమాప్తం కానుంది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)



6

ఆలయంలో లింగమంతుల స్వామి



ఉదయం నల్లగొండలో జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు

మంచు.. ఎండ.. చలి

ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఈ నెల మూడో వారం నుంచి వాతావరణంలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నెల మొదటి వారం నుంచే ఎండలు దంచి కొడుతుండగా, వారం రోజులుగా తెల్లవారుజామున పొగమంచు కురుస్తోంది. ఉదయం 10గంటల నుంచే భానుడి భగభగలు, సాయంత్రం కాస్త చల్లటి గాలులతో కూడిన వాతావరణం ఉంటోంది. బుధవారం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పొగమంచు కప్పేసింది. దీంతో రాష్ట్ర, జాతీయ రహదారులపై వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంచు కారణంగా నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఉదయం 8గంటల వరకు మంచు తెరలు తొలగిపోలేదు. వాహనదారులు లైట్లు వేసుకొని నడిపే పరిస్థితి ఏర్పడింది. వారం రోజులుగా ఉష్ణోగ్రతల్లో హెచ్చు, తగ్గులు ఉంటున్నాయి. వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. ఈ నెల చివరి వారంలో పొడి వాతావరణంతో పాటు పొగమంచుతో కూడిన వాతావరణం ఉండే అవకాశం ఉంది. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రత 19.0డిగ్రీలు ఉండగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 34.0డిగ్రీలుగా నమోదైంది. 10గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగలు మండే ఎండలు, రాత్రి కాస్త ఉక్కపోత, అర్ధరాత్రి నుంచి చల్లటి వాతావరణం ఉంటోంది. శివరాత్రి వరకు చలిగాలులు ఉండనున్నాయి.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
13	20.0	33.2
14	20.4	32.0
15	20.0	33.5
16	19.0	33.5
17	19.4	34.0
18	19.8	34.5
19	19.8	34.0

మద్యం విక్రయాలపై మహిళల దండోరా



మద్యనిషేధంతో ఏపూరులో మూతపడిన ఓ దాబా హోటల్

మద్యం విక్రయాలపై ఆ గ్రామ మహిళలు దండోరా మోగించారు. గ్రామానికి చెందిన యువకుడు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అతడి మరణం అందరినీ కలచివేసింది. అతడి కుటుంబానికి వచ్చిన కష్టం గ్రామంలోని మరే కుటుంబానికి రావొద్దని మద్యం విక్రయాలపై మహిళలు తిరగబడ్డారు. అంతా తీర్మానించుకొని బెల్టుషాపులన్నింటినీ మూసేయించారు. దాబాల్లో సిట్టింగులు నడపవద్దని, మద్యం విక్రయిస్తే రూ.లక్ష, తాగితే రూ.20వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మద్యం విక్రయించినవారిని పట్టిస్తే రూ.10వేల నజరానా కూడా ప్రకటించారు. గ్రామంలో దండోరా వేసి మరీ నిషేధం ప్రకటించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఏపూరులోనే విచ్చలవిడిగా మద్యం విక్రయాలు ఎందుకు సాగాయి? చిన్న గ్రామంలో లెక్కకు మించి బెల్టు దుకాణాలెందుకున్నాయి? పొరుగున ఉన్న మునుగోడు నియోజకవర్గంలో మద్యం నిషేధ ప్రభావం ఎలా చూపిందనే అంశాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- ఓ యువకుడి మరణంతో కదిలిన ఊరు
- ఏపూరు గ్రామంలో నిషేధం విధిస్తూ తీర్మానం
- 13 బెల్టుషాపులను గుర్తించి విక్రయాల నిలిపివేత
- విక్రయిస్తే పోలీసులకు పట్టిస్తామని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి పరిశీలన

జాతీయ రహదారికి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపూరు గ్రామంలో 650 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి సమీపంలో పరిశ్రమలు ఏర్పాటవడం, రవాణారంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండడంతో గ్రామానికి చెందిన యువత ఎక్కువగా డ్రైవర్లుగా స్థిరపడ్డారు. ఊరికి చెందిన 350 మంది డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ ఊళ్లో వ్యవసాయం, కులవృత్తులు ఉండగా, డ్రైవర్లుగా పనిచేసి ఆర్థికంగా స్థిరపడ్డారు. ఐదారేళ్ల క్రితం వరకు పండగలు, పబ్బాలప్పుడు సంప్రదాయాల ప్రకారం పరిమితికి లోబడి కల్లు, మద్యం సేవించడం మిగతా 7వ పేజీలో...



మద్యం విక్రయాలు చేయవద్దని ఓ దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఏపూరులోనే కాదు, జిల్లాలో ఎక్కడైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. అక్రమంగా సిట్టింగులు నిర్వహించే విషయం మా దృష్టికి తీసుకువస్తే దాడులు చేసి, నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎవరూ అక్రమంగా మద్యం విక్రయించవద్దు. ఎక్కడైనా మద్యం అక్రమ విక్రయాలు జరుగుతుంటే మాకు తెలియజేయాలి. ఏపూరులో స్వచ్ఛంద మద్యనిషేధ నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. ప్రజల్లో చైతన్యం రావడం సంతోషదాయకం.

సంతోష్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నల్లగొండ

బెల్టుషాపు నిర్వాహకులకు నోటీసులు

ఏపూరులో మహిళల నిర్ణయం మేరకు గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించిన వారందరికీ నోటీసులు జారీ చేశాం. ఒక్క మద్యం సీసా విక్రయించినట్లు తెలిసినా చట్టపర చర్యలుంటాయని తెలియజేశాం. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా మద్యం విక్రయిస్తే పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి చట్టపర చర్యలు కోరుతాం.

మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పథకాలు, వనరులు, బోర్లు, నల్లా కనెక్షన్‌లు, మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు, పైపులైన్ల మరమ్మతులు, వేసవి కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిర్యాలగూడ డంపింగ్ యార్డ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో శర్మ, తహసీల్దార్ హరిబాబు, ఈఈ వెంకన్న, అసిస్టెంట్ ఇంజనీర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



దామరచర్ల కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

బాలికలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మిర్యాలగూడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమం కింద 'కౌమార బాలికల రుతుస్రావం, వ్యక్తిగత శ్రద్ధ' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే ఎదుగుదల సాధ్యమవుతుందని, అంతేగాక రుతుస్రావం, పునరుత్పత్తి ఆధారపడి ఉంటాయన్నారు. కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, పాల్గొన్నారు.

ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం వాడపల్లిలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని ఆమె దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. కృష్ణా నదిలో లోతట్టు ప్రాంతాల్లో నీరు ఉన్నందున భక్తులకు స్నానం ఆచరించేందుకు ఇబ్బంది అవుతుందని, షవర్ బాత్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి కొరత లేకుండా చూడాలని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య శిబిరం, పోలీస్ బందోబస్తు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను, మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పూజిత ఫర్టిలైజర్ దుకాణాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవసాయం యోగ్యం కాని సర్వే నెంబర్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. రైతు భరోసా, ఎరువుల సరఫరాపై మండలాధికారి కార్యాలయంలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ జవహర్‌లాల్, వాడపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఏఈ జ్యోతి, అనువంశిక ధర్మకర్త సిద్దయ్య ఉన్నారు.

'రైతు భరోసా'పై ఫిర్యాదులు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): రైతు భరోసాపై ఫిర్యాదుల స్వీకరణకు అన్ని మండల వ్యవసాయాధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, వ్యవసాయ యోగ్యంకాని భూముల వివరాలను శనివారంలోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. రైతు భరోసా ఫిర్యాదుల తీసుకొని సోమవారంలోగా వాటన్నింటినీ పరిష్కరించాలన్నారు.

రైతుల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం హాస్యాస్పదం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా పెద్దగట్టు జాతరలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

•6లో..

మిర్చికి మద్దతు ధర కల్పించాలి



కల్లెపల్లిలో మిర్చి దిగుబడిని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

దామరచర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన మిర్చికి ప్రభుత్వం మద్దతు ధర రూ.25వేలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కల్లెపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్చి ధర దారుణంగా పడిపోయిందని, గత ఏడాది క్వింటా ధర రూ.25వేలు ఉండగా, ప్రస్తుతం రూ.12వేలకు తగ్గడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలని, మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మిర్చికి రూ.15వేలు మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చి నేటికీ అమలుచేయలేదని, వెంటనే మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, వినోద్‌నాయక్, ఎర్రనాయక్, దయానంద్, మాలునాయక్, సైదా, సక్క, మంగ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● హిందూవాహిని ర్యాలీ



ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని నాయకులు, కార్యకర్తలు

•8లో..

ఆర్థికంగా మూడో స్థానంలో దేశం



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశం అన్ని సమస్యలు అధిగమిస్తూ ప్రపంచంలో ఆర్థికంగా మూడో స్థానంలోకి నిలిచిందని ఐసీఎస్ఎస్ ఆర్ఆర్ఎస్ ఆర్‌సీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీ కళాశాలలో 'సుస్థిర అభివృద్ధి, సమస్యల పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇలాంటి అంశాలపై జాతీయ సెమినార్లు నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ, పేదరికం, అసమానతలను అంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. సదస్సులో ప్రొఫెసర్లు ఫరీదా బేగం, ఆకుమర్తి నాగేశ్వరరావు, మౌలానా, ఎం.రాములు, దయాకర్, మునిస్వామి, ఆది మల్లేశం, కిరీటం, నర్సింగ్ కోటయ్య, హబీ, అంకుష్, దినేష్, అనిల్‌కుమార్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ పాల్గొన్నారు.

నెలవారంతో నాలుగో రోజు పూర్తి

● నేటితో పెద్దగట్టు జాతర పరిసమాప్తం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దగట్టు జాతర సందర్భంగా లింగమంతులస్వామిని దర్శించుకునేందుకు భక్తుల రాక కొనసాగుతోంది.జాతరలో నాలుగోరోజైన బుధవారం మూడు లక్షల మంది తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుకాణాల్లో కొనుగోళ్లతో సందడి కనిపించింది. ఎగ్జిబిషన్‌లో విహరిస్తూ ఆనందంగా గడిపారు. బుధవారం కూడా మధ్యాహ్నం రెండు గంటల తరువాత భక్తుల రద్దీ ఎక్కువగా పెరిగింది. ప్రతి ఒక్కరూ కుటుంసభ్యులతో కలిసి స్వామి దర్శనం చేసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, మందుల సామేలు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, గిరిదర్‌రెడ్డిలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


నెలవారం నిర్వహిస్తున్న యాదవపూజారులు

మధ్యాహ్నం పోటెత్తిన భక్తులు

పెద్దగట్టు జాతరలో భాగంగా బుధవారం ఉదయం ఎండ వేడిమికి భక్తులు తక్కువగా వచ్చినప్పటికీ మధ్యాహ్నం తర్వాత పోటెత్తారు. సాయంత్రం సమయంలో ఎక్కువ రద్దీ కనిపించింది.

గుట్ట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి పూట సూర్యాపేట నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

నెలవారం

జాతరలో భాగంగా బుధవారం సంప్రదాయబద్ధంగా నెలవారం చేశారు. నూతనంగా తెచ్చిన మట్టితో చేసిన బోనం కుండలలో పాలు పొంగించి స్వామి వారికి పూజలు నిర్వహించారు. సౌడమ్మ తల్లికి యాదవులు మొక్కులు చెల్లించారు. సాయంత్రం చంద్రపట్నాన్ని కళ్ళకు అద్దుకుని గుట్టపైన ఉన్న పుట్టలో పోశారు. అనంతరం దేవరపెట్టెను భారీ ఊరేగింపుతో కేసారానికి తరలించారు.


కదిలివచ్చిన సూర్యాపేట

దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతరకు సూర్యాపేట పట్టణ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు భక్తులతో నిండుగా కనిపించాయి. పట్టణంలో బట్టలు, కిరాణం షాపులు, వివిధ దుకాణాలు మూసివేసిన తర్వాత యజమానులు కుటుంబసభ్యులతో సహా జాతరను సందర్శిస్తున్నారు. లింగమంతుల స్వామిని దర్శించుకోవడంతో పాటు సర్కస్, ఎగ్జిబిషన్ చూసి ఆనందించారు.

ఆంధ్రజ్యోతి ఓ లింగ ఓ లింగా Feb 16-20


సూర్యుడితో బెలూన్ దోబూచులాట
సంధ్యాసమయంలో సూర్యుడిని తాకుతున్నట్లు కనిపిస్తున్న పెద్దగట్టు జాతరలో ఏర్పాటుచేసిన ఎయిర్ బెలూన్


గట్టుపై బోనాలతో మహిళలు






స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సామేల్


స్వామి సన్నిధిలో ఐజీ సత్యనారాయణ, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


దేవతా విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

రైతుల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం హాస్యాస్పదం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష రుణమాఫీనే ఐదు సార్లకు పూర్తిచేసిన బీఆర్ఎస్ రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దగట్టు లింగమంతుల స్వామిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జాతరను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరకు రావడం, లింగమంతులస్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దగట్టుపైకి ఘాట్‌రోడ్డుతో పాటు శాశ్వతపనులు చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయిస్తామన్నారు. రైతుల ఉసురు తగిలే మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత జైలు పాలైందని, బీఆర్ఎస్ ఓటమి పాలైందన్నారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం వచ్చిందని, పేదలకు ఇళ్లు కట్టించే శక్తిని ప్రసాదించాలని లింగమయ్యను కోరుకున్నట్లు తెలిపారు. జాతరను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం రూ.5కోట్లు నిధులు విడుదల చేసిందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల, శ్రీరాంసాగర్ కాల్వలు తీయలేదన్నారు. సూర్యాపేటకు నీరు ఇవ్వలేదు, గంధమళ్ల ప్రాజెక్ట్ పూర్తి చేయలేక ఆలేరును ఎండబెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దేనన్నారు. పదేళ్ల కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉన్నపుడు ఆస్ట్రేలియా, అమెరికా, లండన్‌లో కాకుండా దురాజ్‌పల్లిలో ఎందుకు బోనం ఎత్తలేదని కవితను ప్రశ్నించారు. అధికారం కోల్పోయాక దురాజ్‌పల్లి గుర్తుకు వచ్చిందా అని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి ప్రజలను చూసే ఓపిక లేదని, ఆయనకు డబ్బు తప్ప మరో ధ్యాస లేదన్నారు.

మంత్రి వెంట పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పోలెబోయిన నర్సయ్యయాదవ్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఉన్నారు.


డోలు వాయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాలో మూడుచోట్ల చోరీలు

● రూ.20.31 లక్షలు సొత్తు చోరీ


దేవరకొండలోని వాసు ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

దేవరకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని భారీ చోరీ జరిగింది. బుధవారం పట్టపగలు మీనాక్షిప్లాజా కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి శీల వాసు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో సుమారు రూ.16.50 లక్షల సొత్తు అపహరణకు గురైంది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్న శీల వాసు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యానికి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని 19 తులాల బంగారం, రూ.10వేల నగదును చోరీ చేశారు. సాయంత్రం వాసు ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గమనించాడు. 19 తులాల బంగారం, రూ.10వేల నగదు చోరీకి గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. వాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు సీఐ తెలిపారు.

హాలియాలో బైక్‌లో పెట్టిన రూ.2 లక్షలు

హాలియా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీలో బైక్ ముందు కవర్‌లో పెట్టిన రూ.2 లక్షల నగదు బుధవారం చోరీకి గురైంది. ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన కొండల్ హాలియాలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.2 లక్షల నగదు డ్రా చేసుకొని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకొని దేవరకొండ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణం వద్దకు వెళ్లాడు. అక్కడ బైక్ పార్క్ చేసి తిరిగి వచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు నగదును చోరీ చేసినట్లు గమనించాడు. స్థానిక సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా రెడ్ కలర్ పల్సర్ బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి నగదును చోరీ చేసి సాగర్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. కొండల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.


సీసీ ఫుటేజీలో నమోదైన అనుమానితులు

ధాన్యం విక్రయించిన నగదు దోపిడీ
రైతుపై దాడి చేసి ఎత్తుకెళ్లిన వైనం

అనంతగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన పంటను విక్రయించిన ఆనందం ఆ రైతుకు ఎంతోసేపు మిగలలేదు. ధాన్యం విక్రయించిన డబ్బును తీసుకువెళుతుండగా, మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు అటకాయించి బెదిరించి, దాడి చేసి డబ్బును గుంజుకెళ్లారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అనిల్‌కుమార్, బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొడబాలు పుల్లయ్య వానాకాలం సీజన్‌లో వరి సాగు చేశాడు. పండిన ధాన్యాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యాపారి కొత్త శేఖర్‌కు విక్రయించగా, రైతు పుల్లయ్యకు రూ.1.76లక్షలు వచ్చాయి. సంబంధిత నగదును నేలకొండపల్లి గ్రామంలో వ్యాపారి వద్ద నుంచి తీసుకున్న రైతు పుల్లయ్య గ్రామానికి మోపెడ్‌పై బయలుదేరాడు. 10కిలోమీటర్లు దాటిన తర్వాత వెనుక నుంచి ముగ్గురు వ్యక్తులు ఓ ద్విచక్ర వాహనంపై రైతును అనుసరించారు. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులోకి రాగానే వాహనాన్ని అడ్డగించి పుల్లయ్యను బెదిరించి, దాడి చేసి రూ.1.76లక్షలు గుంజుకెళ్లారు. ఈ ఘటనపై బాధిత రైతు పుల్లయ్య అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

● మృతుల్లో తండ్రీ, కుమారుడు, డ్రైవర్, క్లీనర్


చిన్నారి వీర్నాష్, సాయికుమార్ మృతదేహాలు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, ఐదునెలల కుమారుడు మృతి చెందారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన సుంకి సాయికుమార్(33) భార్య, తల్లితండ్రులతో కలిసి కారులో హైదరాబాద్‌లోని పటాన్‌చెరువుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి కారులో వస్తున్నాడు. దండుమల్కాపురం చెరువు సమీపంలో రాగా అదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన సందీప్‌రెడ్డి కారు అదుపు తప్పి డీవైడర్‌ను దాటి విజయవాడ వైపు వెళ్తున్న సాయికుమార్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ మృతి చెందగా, చిన్నారి వీర్నాష్(5 నెలలు) తీవ్రగాయాలు కాగా స్థానిక ప్రయాణికులు కాపాడటానికి సీఆర్‌పీ చేసి యత్నించారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. సాయికుమార్ భార్య విజయ, తల్లితండ్రులు వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మలకు, హైదరాబాద్ వెళ్తున్న కారులోని సందీప్‌రెడ్డి, ఆయన భార్యకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఇదిలాఉండగా సాయికుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం.

లారీని కంటైనర్ ఢీకొట్టడంతో...


లారీ వెనక ఢీకొన్న కంటైనర్, కంటైనర్‌లో డ్రైవర్, క్లీనర్ మృతదేహాలు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ముందువెళ్తున్న లారీ వేగాన్ని అంచనా వేయడంలో వైఫల్యం చెందడంతో నల్లగొండ జిల్లా కేంద్ర పరిధిలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై పానగల్ సమీపంలోని ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన కంటైనర్ డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు. టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీరాల నుంచి చౌటుప్పల్ పరిధిలోని దివీస్ కంపెనీకి సిలికాన్ ఇసుక లోడుతో ఏపీ 39ఎక్స్ 1489 నెంబర్ గల లారీ చీరాల నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తుంది. అదే సమయంలో చెన్నై నుంచి ఢిల్లీకి మెడికల్ లోడుతో వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐషర్ కంటైనర్ లారీ వెనకాలే వస్తుంది. ఈ క్రమంలో పానగల్ వద్ద బైపాస్ ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గింది. దీంతో వేగాన్ని అంచనా వేయడంలో వైఫల్యం చెందిన కంటైనర్ డ్రైవర్ లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ అండ్ ఓనర్ అయిన అద్వేష్‌కుమార్(36)తో పాటు అదే కంటైనర్‌లో ఉన్న క్లీనర్ రాజీవ్(35) నుజ్జయిన కంటైనర్‌కు లారీకి మధ్యలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు, స్థానికులు సుమారు 2 గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందించి నల్లగొండ జనరల్ ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు. గురువారం మృతుల కుటుంబ సభ్యులు నల్లగొండకు వస్తున్నట్లు సమాచారం.

అజీంపేటలో కొనసాగిన పోలీస్ బందోబస్తు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం అజీంపేటలో పోలింగ్ బందోబస్తు కొనసాగుతోంది. గ్రామంలో ఓ వ్యక్తి హత్య కేసులో నల్లగొండ కోర్టు 17 మందికి జీవిత ఖైదు విధించడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు బుధవారం తెలిపారు.


అజీంపేటలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

బేతవోలు జాతరలో పూజలకు మాత్రమే అనుమతి

చిలుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో కనుకదుర్గమ్మ జాతరలో పూజలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తెలిపారు. ప్రతీ ఏడాది శివరాత్రికి ముందు గురు, శుక్ర, శనివారాల్లో బేతవోలు కనుకదుర్గమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తారు. గ్రామంలో పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో పాటు, కొన్నిరోజులుగా గ్రామంలో పలు వివాదాలు జరుగుతుండటంతో సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. గ్రామంలో వివాదాలు జరగకుండా ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహిస్తున్నారు.


బేతవోలులో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

కోడిపందేల స్థావరంపై దాడి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామశివారులో బుధవారం కోడి పందేలు ఆడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. బహిరంగంగా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.4వేల నగదు, ఆరు బైక్‌లు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా లాడ్జీలను ఇవ్వొద్దు: ఏసీపీ

యాదగిరిగుట్టరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): లాడ్జీ యజమానులు ఎటువంటి గుర్తింపుకార్డులు లేని వారికి, అక్రమజంటలు, మైనర్లకు ఇవ్వవద్దని, ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఏసీపీ రమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం యాదగిరిగుట్టలోని పాత గుట్ట సమీపంలోని లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లాడ్జీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆయనతో పాటుగా సీఐ రమేష్ ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో బుధవారం తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గూడ దశరథ కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు చికిత్సకోసం 108 వాహనంలో సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

రామన్నపేటలో మూడు నెలల్లో పది చోట్ల చోరీలు

రామన్నపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పట్టణంలో మూడు నెలల్లో చోరీలు ఎక్కువయ్యాయి. నివాస గృహాలతో పాటు వ్యవసాయ బావుల వద్ద చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసిన ఇళ్లలే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. జనవరిలో చిన్న మసీదు పరిసర ప్రాంతాల్లో భువనగిరి, చిట్యాల వెళ్లే ప్రధానరహదారి వెంట ఉన్న వైన్ షాపుల్లో, హార్డ్‌వేర్ దుకాణాల్లో, రైల్వే కాలనీల్లో, భువనగిరి రహదారి సమీపంలోని ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీలు జరిగాయి. మూడు రోజుల కిందట రైల్వే కాలనీకి చెందిన ఓ ఇంటికి తాళం వేసి ఉండగా పగులగొట్టి 40 తులాల వెండి, మూడు తులాల బంగారం చోరీ చేశారు.

ముందు రెక్కీ

రామన్నపేటలో తాళం వేసిన ఇళ్లు, వ్యాపార సముదాయాలే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ముందు రెక్కీ నిర్వహించి రాత్రుళ్ల చోరీలకు పథక రచన చేస్తున్నట్లు సమాచారం. భువనగిరి రోడ్డులోని రైల్వే కాలనీ వైపు ఉన్న రహదారిలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. వరుస దొంగతనాల నేపథ్యంలో రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దొంగల జాడే దొరకలేదు



రోజు మాదిరిగానే వ్యవసాయ బావి వద్ద పొలానికి నీళ్ల పెట్టడానికి వెళ్లి సాయంత్రానికి ఇంటికి వస్తుంటా. బావి వద్ద రెండు సార్లు, నాలుగు మోటార్లు, విద్యుత్ కేబుల్ చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ.80వేలు. రెండు సార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. ఇప్పటివరకు దొంగల జాడే దొరకలేదు. పోలీసులు స్పందించి చోరీ సొత్తు రికవరీ చేయాలి.

సింగనబోయిన గణేష్, ఇంద్రపాలనగరం

సిబ్బందితో ప్రత్యేక చర్యలు

రామన్నపేటలో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. నిరంతరం గస్తీ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజలు ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారమిస్తే మానటరింగ్ సిస్టం ద్వారా నిఘా ఉంచుతాం.

పీ మల్లయ్య, ఎస్ఐ, రామన్నపేట

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి


రాస్తారోకో చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

నూతనకల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వకు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎర్రపహాడ్ క్రాస్‌రోడ్ వద్ద సూర్యాపేట-దంతాలపల్లి ప్రధానరహదారిపై బీజేపీ నాయకులు, రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటికీ ఎస్సారెస్పీ జలాలు నూతనకల్ మండలానికి రాలేదన్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగి భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. బోర్లలో నీరు తగ్గి పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ అధికారులు అక్కడికి చేరుకుని చివరి గ్రామాలకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, ఏసు, ఇస్తారి, బిక్షంరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాల్వకు అడ్డుకట్టలు వేస్తే చర్యలు

మద్దిరాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాల్వలో నీరు కింది ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకట్టలు వేస్తే చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా మద్దిరాల తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు రైతులు కాల్వకు అడ్డుగా కట్టలు వేయడంతో చివరి భూములకు నీరందడం లేదన్నారు.

పంచకుండాత్మక మహాయాగానికి శ్రీకారం



స్వామివారి ఆలయ తిరువీధి సేవోత్సవం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు బుధవారం ఆలయంలో స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టారు. పాంచరాత్రాగమనుసారం స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణ వేడుకలను సర్వసైనాధ్యక్షుడు విశ్వక్సేనుడికి తొలిపూజలు నిర్వహించారు. పంచామృత కలశాలకు వేద మంత్రాలతో దర్భ(గరక)లతో పూజలు నిర్వహించారు. గర్భాలయంలోని స్వయంభువులు, కవచ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి కంకణధారణ చేశారు. రుత్విక్‌వరణం, మృత్యంగ్రహణం, పర్యగ్నీకరణం నిర్వహించి ప్రధానాలయం నుంచి స్వామివారి సేవతో పాటు దీక్షా కంకణాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నం 12గంటలకు ఆలయ ఉత్తర తిరువీధిలో ఏర్పాటు చేసిన యాగశాలకు చేర్చారు. అఖండ దీపారాధన చేసి సంధ్యాకురార్పణ, ద్వారతోరణ ధ్వజకుంభారాధన అనంతరం అంకురార్పణ, మృత్యంగ్రహణం నిర్వహించారు. నవధాన్యాలను నిర్దేశించిన పాలికల్లో వేద మంత్రాలతో పవిత్రీకరించి తడిపి మొలకెత్తించే కార్యక్రమమే అంకురార్పణం. భూమిపై గల క్షేత్రాలు పచ్చని పంటలతో సస్యశ్యామలంగా వర్థిల్లింపడానికి భగవంతుడిని అనుగ్రహింప జేయడానికి ఈ అంకురార్పణం కార్యక్రమం నిర్వహించే ఉద్దేశమని ఆలయ ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. వేద మంత్రాల నడుమ అగ్నిప్రతిష్ట చేపట్టి అర్చక బృందం పారాయణిక పరివారంతో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల రుత్వికులు హోమాలు నిర్వహించారు. హైదరాబాద్(కొత్తపేట) చెందిన టి. రాజేష్ అర్చకులు, 108 మంది రుత్వికులకు దీక్షా వస్త్రాలు అందజేశారు. యాగశాలలో సాయంత్రం మంత్ర హోమాలు, వారుణానువాక హోమం, జలాధివాసం, నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాదగోష్ఠి చేసి ఊరేగింపుగా ఆలయ ప్రవేశం చేశారు. వేడుకలు వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, కొడకండ్ల మాధవచార్యులు పాల్గొన్నారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ముఖమండపంలో 108కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు.



పూజల్లో పాల్గొన్న శైలజరామయ్యర్, కలెక్టర్, ఈవో తదితరులు

సమన్వయంతో పనిచేయాలి

స్వర్ణ గోపురం ప్రారంభోత్సవానికి ఈ నెల 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్ అధికారులకు సూచించారు. యాదగిరి గుట్టపై బుధవారం యాగశాలను సందర్శించి కొండకింద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఎం. హనుమంత రావు, ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలకు వీఐపీలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశముందని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత సభలు



సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సంగీత సభలు నిర్వహించారు. సాయంత్రం 6నుంచి 7గంటల ఎం.వి. సుధాకర్ (విజయవాడ) కర్ణాటక సంగీతం, 7 నుంచి 8 వరకు శాంకరి కూచిపూడి నృత్యం(హైదరాబాద్) కూచిపూడి నృత్యం, 8 నుంచి 9గంటల వరకు ఇందిరా కళానికేతన్ హైదరాబాద్ (మహతి బృందం) కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది.

వైభవంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి వేడుకలు.. గిరిప్రదక్షిణ పర్వాలు బుధవారం వైభవంగా కొనసాగాయి. స్వామివారి స్వాతి నక్షత్రం పూజల్లో భాగంగా అర్చకులు ఆలయంలో అష్టోత్తర శత ఘటాభిషేకం చేపట్టారు. తెల్లవారుజామున గిరిప్రదక్షిణ మహోత్సవంలో స్వామివారిని స్తుతిస్తూ కళాకారుల కోలాటాలు, నృత్యాలు, భజనలు, కీర్తనలతో హోరెత్తించారు. తెల్లవారుజామున 5.45గంటలకు అర్చకులు వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాల నడుమ అర్చకులు హారతి సమర్పించగా ఈవో భాస్కర్‌రావు ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ. 24,44,864 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

సర్వాంగసుందరంగా స్వర్ణ గోపురం



విద్యుత్‌దీపాలతో అలంకరించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ స్వర్ణ గోపురం ఆవిష్కరణకు సర్వాంగసుందరంగా ముస్తాబైంది. నాలుగు రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో 108మంది రుత్వికులు, పారాయణికులు హోమం నిర్వహిస్తారు. 23వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వర్ణ గోపురం ప్రారంభోత్సవంలో పాల్గొని మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ క్రతువు నిర్వహణకు ఆలయ ఉత్తర తిరువీధిలో యాగశాలను ఏర్పాటు చేశారు. కోతుల నుంచి రక్షణకు నైలాన్ నెట్‌తో సిద్ధం చేశారు. హోమాల్లో నాలుగు రోజుల పాటు వివిధ మంత్రాలు పఠిస్తూ స ముద్రాలు, నదులను అవాహన చేస్తూ యజ్ఞకుండాల్లో ఆవాహన చేసి యాగంలో పాల్గొనే వేద పారాయణికులు, రుత్వికులకు దీక్ష వస్త్రాలు అందజేస్తారు.

దేవతాహ్వానం, సమిదలు

నాలుగు దిక్కుల్లో బ్రహ్మ, క్షేత్రపాలకుడు, సోముడును ఆహ్వానించి ఈశాన్యంలో మాత్రం అంకురార్పణకు పాలికలు ఏర్పాటు చేస్తారు. మధ్యలో కవచమూర్తులను అధిష్టించి నదీజలాలతో కూడిన కలశం ఏర్పాటుకు వేదికను ఏర్పాటు చేశారు. వేదికకు చుట్టూ తూర్పు వాసుదేవ కుండం, దక్షిణం ప్రద్యున్న కుండం, పశ్చిమం సంకర్షణ కుండం, ఉత్తరం అనురుద్ధ కుండం, ఈశాన్యంలో మహాలక్ష్మీకుండంతో ఐదు హోమకుండాలు ఏర్పాటు చేశారు. అగ్నిమథనం చేసి నరసింహ, సుదర్శన, గరుత్మంతుడి, లక్ష్మీదేవి మంత్రాలు, దివ్య విమాన రాజగోపురం(బంగారుమయం)లోని దేవతలకు అవిస్సులు అందజేస్తారు. యాగశాలలోని హోమాల్లో మర్రి, రావి, మోదుగు, జువ్వి, మామిడి సమిదలు వినియోగిస్తారు.

రామనుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు

ఈ నెల 22వ తేదీ వరకు లక్ష్మీ, నరసింహ, సుదర్శన, రామాయణం, బాగవతం, మూల మంత్ర హవనాలు, మూల మంత్ర జపాలతో పాటు ఉదయం సాయంత్రం విష్ణు, నరసింహ, రామాయణం, బాగవత పారాయణాలతో పాటు అభిషేకాలు 60మంది రుత్వికులు నిర్వహిస్తారు. చివరి రోజు ముందుగా దిష్టికుంభం, నైవేద్యం, గుమ్మడికాయ, కొబ్బరికాయ సమర్పించి మహా కుంభాభిషేక కలశంతో వానమామలై 31వ మధుర పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వర్ణ గోపురానికి పంచకుండాత్మక మహాయాగం నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



దేవరాజ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవరాజ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపికయ్యాడు. ఈ నెల 18వ తేదిన హాలియా మండలం ఇబ్రహీంపేటలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 20,21,22వ తేదీల్లో వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థినిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, ఏటీపీ గాయత్రి, పీడీ జ్యోతి, అరుణ, నర్సింహ, జానకిరామ్ అభినందించారు.

సబ్‌జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లు ఎంపిక

హాలియా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. **బాలికల జట్టులో..** ఎండీ. అఫ్మా(అలీనగర్), వి. సాయిఅభిగ్న(తిరుమలగిరి), సంతోషి(నల్లగొండ), మల్లేశ్వరీ(చింతపల్లి), ఉద్దపన(దేవరకొండ), చందన, (మల్లేపల్లి), అనూత్న(హాలియా), సిరివెన్నెల(అనుముల), జిగ్నేష(ఉట్లపల్లి), వర్షిత(వెల్మగూడెం), నిహారిక(పులిచర్ల), అక్షయ(యాదగిరిపల్లి) ఎంపికయ్యారు. కోచ్‌గా బి. పరమేష్, మేనేజర్‌గా ఎస్‌కే. అయోషా వ్యవహరిస్తారు.

బాలుర జట్టులో.. టి. కార్తీక్(అనుముల), కార్తీక్(కుర్మేడు), పవన్ (హాలియా), నితిన్(చెరుకుపల్లి), శివ(కుర్మేడు), శివ(బసిరెడ్డిపల్లి), మనోజ్ (నాగార్జునపేట), దేవరాజ్(బీసీ స్కూల్ సాగర్), మణికంఠ (ఇబ్రహీంపేట), నిఖిల్(చెరుకుపల్లి) ఎంపికయ్యారు. కోచ్‌గా కె. రాము, మేనేజర్‌గా, ఏ. చంద్రశేఖర్ వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాకేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులను నడిపించనుంది. ఈ నెల 25 నుంచి 27 వరకు ఉమ్మడి జిల్లాలోని 7డిపోల పరిధిలో 70 బస్సులను నడిపించడానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి దూర ప్రాంతాలకు కాకుండా మూడు జిల్లాలోనే వివిధ దేవాలయాలకు బస్సులు నడిపించేలా ప్రణాళికలు రూపొందించారు. దేవరకొండ డిపో నుంచి మాత్రం శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తారు. ఇప్పటికే చెరువుగట్టు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులను నడిపిన ఆర్టీసీ, ప్రస్తుతం పెద్దగట్టు జాతర ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కోదాడ డిపో నుంచి మేళ్లచెర్వుకు 30 బస్సు సర్వీసులు, దేవరకొండ డిపో నుంచి శ్రీశైలానికి 25 సర్వీసులు, మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లికి ఐదు సర్వీసులు, మిర్యాలగూడ డిపో నుంచి అడవిదేవులపల్లి మండలం సత్రశాలకు ఐదు సర్వీసులు, సామప్పకు మరో ఐదు సర్వీసులు నడిపిస్తారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినందున ఆర్టీసీ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్ కె. జానిరెడ్డి కోరారు.

మద్యం విక్రయాలపై మహిళల దండోరా



మద్యం విక్రయాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో మద్యం విక్రయించే కిరాణా దుకాణాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఏపూరు గ్రామ మహిళలు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

అన్ని గ్రామాల్లో లాగానే ఇక్కడా కొనసాగేది. అంతకుమించి ఒకరిద్దరు మినహా విచ్చలవిడి మద్యం సేవించడం ఇక్కడ ఉండేది కాదు. క్రమంగా పరిస్థితి మారింది. ఊళ్లో లెక్కకు మించి బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. 650 కుటుంబాలు, 2,500కు లోబడి జనాభా ఉన్న గ్రామంలో 13 బెల్టుషాపులు వెలిశాయి. మద్యం విక్రయాలు విచ్చలవిడిగా మారాయి. బెల్టు దుకాణాలే కాకుండా కిరాణాషాపులు, పాన్ షాపుల్లోనూ మద్యం విక్రయాలు కొనసాగాయి. ఒక్కో దుకాణం వద్ద రోజూ రూ.50వేల నుంచి రూ.80వేల వరకు అమ్మకాలు సాగేవి. గ్రామ సమీపంలో దాబాలు వెలిశాయి. ఇక్కడ అక్రమ సిట్టింగులు ప్రారంభమయ్యాయి. అక్కడే తాగి, తిని జేబు ఖాళీ చేసుకుంటుండటంతో కుటుంబాలు ఆర్థికంగా కుంగడం ప్రారంభమయ్యాయి. ఈ గ్రామం తర్వాత ప్రారంభమయ్యే మునుగోడు నియోజకవర్గంలో ఇటీవల మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది.

అక్కడి మద్యం ప్రియులంతా ఈ గ్రామానికి రావడం ప్రారంభమైంది. దీంతో గ్రామంలో మద్యం విక్రయాలు మరింత పెరిగాయి. అప్పుగా సైతం మద్యం ఇస్తుండడంతో గ్రామ యువత మద్యానికి బానిసయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ధనుంజయ (29) అనే యువకుడు డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. యువకుడి మృతితో అతడి కుటుంబం ఆధారం కోల్పోయింది. ఇది గ్రామస్థులను కలచివేసింది. గ్రామంలో మద్యం దుకాణమే లేకుండా చేయాలనే పట్టుదల మద్యం విక్రయాల నిషేధానికి దారితీసింది.

మునుగోడు నియోజకవర్గంలో మద్యనిషేధంతో

ఏపూరు గ్రామం దాటిన తర్వాత మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్‌నారాయణపురం మండలం గుజ్జ గ్రామం వస్తుంది. మునుగోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా హెచ్చరికలు చేయడం, చైతన్య కార్యక్రమాలు చేపట్టడంతో నియోజకవర్గంలో ఒక్క బెల్టుషాపు కూడా లేకుండా చేశారు. దీంతో అక్కడి మద్యం ప్రియులంతా సమీపంలో ఉన్న ఏపూరులోని అక్రమ సిట్టింగులు, దాబాలు, బెల్టుషాపుల వద్దకు వచ్చి మద్యం తాగడం, చికెన్, మటన్ దావత్‌లు చేసుకోవడం ప్రారంభించారు. ఒక్కో బ్యాచ్ వస్తే రూ.20వేలు మొదలు రూ.లక్ష వరకు ఖర్చు చేసేవారు. గ్రామానికి సమీపంలో ఉన్న గుజ్జ, నారాయణపురం, ఆరెగూడెం, చౌటుప్పల్, పుట్టపాక తదితర గ్రామాల నుంచి కూడా మద్యం ప్రియులు ఇక్కడికి వచ్చి డబ్బు వదిలించుకోవడమే కాదు, జీవితాల్ని నాశనం చేసుకున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

మహిళలపై ఒత్తిడి తెస్తున్న బెల్టుదుకాణాల నిర్వాహకులు

గ్రామంలో మహిళలంతా మూకుమ్మడిగా మద్యం విక్రయాలపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ప్రస్తుతం వారం రోజులుగా విక్రయాలు నిలిచాయి. అయితే బెల్టుదుకాణాల నిర్వాహకులు, అక్రమ సిట్టింగుల నిర్వాహకులు మాత్రం ఏదోరకంగా నిషేధాన్ని సడలించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు మహిళలు చెబుతున్నారు. మహిళల్లో చైతన్యానికి కృషి చేసిన వారిపై ఒత్తిళ్లు తెస్తున్నారని, రాజకీయాలు అంటగట్టి ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఆటంకాలైనా భయపడేదిలేదని, ఎట్టిపరిస్థితుల్లో గ్రామంలో మళ్లీ బెల్టుదుకాణాలు నడవనిచ్చేది లేదని మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగాలంటే అధికారులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కూడా సహకరించాలని, ఒక్క మద్యం సీసా విక్రయించినా కేసు పెట్టాలని, రాజకీయనాయకులు పార్టీలకతీతంగా మహిళల నిర్ణయానికి మద్దతివ్వాలని, ఎవ్వరూ బెల్టుషాపుల నిర్వాహణకు మద్దతు ఇవ్వకూడదని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఇసుక రీచ్‌లపై నిఘా పెంచాలి

● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



వంగమర్తిలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

శాలిగౌరారం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపుపై నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మైనింగ్, తదితర శాఖల అధికారులతో కలిసి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వంగమర్తి, ఇటుకలపహాడ్ ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక తవ్వే ప్రాంతాలను బుధవారం తనిఖీ చేశారు. వంగమర్తి, ఇటుకలపహాడ్ రీచ్‌ల వద్ద ఇసుక తవ్వే ప్రాంతాల్లో ఇది వరకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా, వే బ్రిడ్జి, ఇసుకను లోడ్ చేసే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, రాత్రి సమయాల్లో కూడా స్పష్టంగా కనిపించే సామర్థ్యం కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు వంగమర్తి ఇసుక రీచ్ నుండి తీసిన ఇసుక పరిమాణం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం వంగమర్తి ఇసుక రీచ్ నుంచి లక్షా 16వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తీసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక సరఫరాను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ పరిమితికి మించి లోడును తీసుకువెళ్లకూడదని, అన్ని అంశాలకు రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ఇటీవల ఎస్పీ ఆదేశాల మేరకు వంగమర్తి ఇసుక రీచ్ వద్ద 24గంటలు తనిఖీ చేసే విధంగా పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో వంగమర్తితో పాటు, ఇంకా 24ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటిద్వారా ప్రభుత్వ పనులకు ముఖ్యంగా ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, తదితర శాఖలకు ఎంత ఇసుక అవసరం ఉందో దానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన విషయమై గురువారం సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ వంగమర్తి ఇసుక రీచ్ నుంచి ఇసుక అక్రమంగా రవాణా కాకుండా పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు, తదితర విషయాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో భూగర్భజల వనరుల శాఖ సహాయ సంచాలకులు జాకబ్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తహసీల్దార్ పి. యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి ఉన్నారు.

ఉపాధి కల్పించక.. ఆత్మీయ భరోసా అందక

● 20రోజులు ఉపాధి పని కల్పించకపోవడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు కోల్పోయిన కూలీలు

మోత్కూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూలీల వలసలు నివారించి, వారికి ఉపాధి కల్పించడానికి అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకం యాదాద్రిభువనగిరి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో పరుగులు పెడుతుండగా, మరికొన్ని మండలాల్లో మందకొడిగా సాగుతోంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాలన్నది లక్ష్యం కాగా, ఏ మండలంలోనూ ఆ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరడం లేదని తెలుస్తోంది. భూమి లేని వ్యవసాయ కూలీలను(మహిళలను) ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమల్లోకి తెచ్చింది. ఈ పథకంలో ఆరు మాసాలకు రూ.6వేల చొప్పున ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తున్నారు. ఈ పథకంలో లబ్ధిపొందడానికి ఉపాధి హామీ పథకంలో కనీసం 20రోజులైనా పనిచేసి ఉండాలన్న నిబంధన. 20రోజులు పని కల్పించని కారణంగా కొందరు కూలీలు నష్టపోయారు.

లక్ష్యానికి అతిచేరువలో నాగారం.. దూరంలో శాలిగౌరారం

తుంగతుర్తి నియోజకవర్గంలో తొమ్మిది మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 78,480 జాబ్‌కార్డులు ఉండగా 1,70,384 మంది కూలీలు నమోదై ఉన్నారు. అందులో 53,477 జాబ్‌కార్డులు ఆక్టివ్‌లో ఉన్నాయి. 96,756 మంది కూలీలు పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు 20,62,738 రోజులు పని కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకు 16,49,579 రోజులు పని కల్పించారు. ఇంకా 4,13,159 రోజులు పని కల్పించాల్సి ఉంది. నాగారం మండలం లక్ష్యానికి చేరువలో ఉండగా, శాలిగౌరారం మండలం చివరన నిలిచింది.

కొన్ని పనులు తగ్గించడంతో...

ఉపాధి హామీలో గతంలో చెరువుల పూడికతీత, భూమి అభివృద్ధి పనులు ఎక్కువగా చేసేవారు. ఈ పనుల్లో ఎక్కువ కూలీలకు పని లభించేది. ఇప్పుడు పూడిక తీత పనులు నిలిపివేశారు. భూమి అభివృద్ధి పనులు మాత్రం కొనసాగిస్తున్నారు. భూమి అభివృద్ధి పనులు కూడా ఇప్పటికే ఎక్కువ జరిగినందున ఇప్పుడు చాలా తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఉపాధి హామీ కూలీలకు ఎక్కువగా పనులు కల్పించలేకపోతున్నట్టు చెబుతున్నారు.

మండలాల వారీగా వివరాలు ఇలా...

మండలం	జాబ్‌కార్డులు	ఆక్టివ్‌లో ఉన్నవి	కూలీల సంఖ్య	ఆక్టివ్‌లో కూలీలు	పనిదినాలు	చేసినవి	చేయాల్సినవి
మోత్కూరు	3,506	2,719	6,290	4,447	1,16,107	71,807	44,300
అడ్డగూడూరు	5,677	4,427	10,816	7,616	1,45,500	1,26,526	18,974
తుంగతుర్తి	13,427	8,938	29,400	16,935	3,74,720	3,16,280	58,440
తిరుమలగిరి	5,960	4,653	13,505	9,305	2,25,177	1,58,676	66,501
నాగారం	9,444	5,771	21,593	10,951	1,37,450	1,37,341	109
నూతనకల్	10,034	6,971	22,830	12,816	2,97,720	2,40,860	56,852
మద్దిరాల	8,998	6,435	20,256	12,168	2,49,065	2,45,143	3,922
అర్వపల్లి	8,690	5,847	19,075	10,261	2,62,116	2,01,707	60,409
శాలిగౌరారం	12,744	7,716	26,619	12,257	2,54,883	1,51,231	1,03,652
మొత్తం	78,480	53,477	1,70,384	96,756	20,62,738	16,49,579	4,13,159

ఆత్మీయ భరోసా ఆర్థిక సాయం కోల్పోయాం



మాకు భూమి లేదు. నేను, నా భార్య కూలి పనులకు వెళతాం. ఉపాధి కూలి పనులు చేస్తాం. భార్యాభర్తలను, ఒకచోట (ఏరియాలో) ఉండే కూలీలను ఒకే గ్రూపులో ఉంచకుండా వేర్వేరు గ్రూపుల్లో పెడుతున్నారు. దీంతో సమాచారం సక్రమంగా అందడం లేదు. పని కల్పిస్తున్న సమాచారం అందక మేము 20 రోజులు పనిచేయలేక ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సహాయాన్ని కోల్పోయాం.

● ఈరసరపు రవి, ఉపాధి కూలి, తొండ గ్రామం, తిరుమలగిరి మండలం

పూడికతీత లాంటి పనులు తొలగించడంతో..

ఉపాధి హామీ పథకంలో గతంలో చెరువు పూడిక తీత లాంటి పనులు ఉండటంతో ఎక్కువ మంది కూలీలకు పని లభించేది. ఇప్పుడు ఆ పనులను ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి తొలగించింది. ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో అవసరం ఉండడం లేదు. దీంతో పని రోజులు పూర్తి చేయడంలో కొంత ఆలస్యమవుతోంది. ఆర్థి సంవత్సరం మార్చి 31 పూర్తయ్యే లోగా పని రోజుల లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

● లక్ష్మీ, ఏపీవో, తిరుమలగిరి

జడ్పీహెచ్‌ఎస్‌కు ఫ్యాన్లు బహూకరణ

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌కు గ్రామ మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ ఆవుల మంజులజానయ్య ఫ్యాన్లను బహూకరించారు. జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జలంధర్‌రెడ్డి, ఆవుల జానయ్య ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయుడు లుకేందర్‌రెడ్డికి అందజేశారు. విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏర్పుల నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని వినతి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలానికి అదనపు 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ భారతీయ జనతా యువమోర్చా మండల శాఖ అధ్యక్షుడు యాట చంద్రశేఖర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారిపై ఉన్న నార్కట్‌పల్లి వద్ద ఒక్క అంబులెన్స్ మాత్రమే ఉండటంతో వేర్వేరు చోట్ల ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు సమయానికి అంబులెన్స్ అందుబాటులో లేక ప్రాణనష్టం జరుగుతోందని పేర్కొన్నారు.

అపరిశుభ్రంగా పీహెచ్‌సీ పరిసరాలు

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND



ఆస్పత్రి ప్రహరీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం



శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్యం లోపించింది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో కంపచెట్లు, చెత్తాచెదారం ఉండటం వల్ల పాములు, తేళ్లు వస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ప్రహరీ గోడకు పెంట కుప్పలు, వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోందని, పలువురు పేర్కొంటున్నారు. ఆస్పత్రి వైద్యురాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రి లోపల, బయట పేరు కుపోయిన చెత్తాచెదారం, కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● శాలిగౌరారం

శివాజీ స్ఫూర్తితో పనిచేయాలి

● జిల్లాలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

● పలు చోట్ల ర్యాలీలు



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ క్రైం, నాంపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హిందూధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తితో పనిచేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీమహరాజ్ జయంతి సందర్భంగా జిల్లాలో పలు మండలాల్లో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శివాజీ విగ్రహాలు, చి త్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలుయచోట్ల ఆయన చిత్రపటానికి క్షీరాభిషేంక చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణ కోసం ఛత్రపతి శివాజీ ఎన్నో గెరిల్లా యుద్ధాలు చేసి జయించారని అన్నారు. ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు.

● జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రామగిరిలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ చిత్రపటం, విగ్రహాలను రామాలయం నుంచి పట్టణంలోని పురవీధుల గుండా కాషాయ జెండాలతో ఊరేగించారు. రామగిరి యువత ఉత్సాహం నృత్యాలతో ర్యాలీని శోభాయమానంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వివిధ పాఠశాలల్లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించి వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జనగణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ నగర్‌లో ఉన్న ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి సమితి ప్రధాన కార్యదర్శి కొలనుపాక రవికుమార్, సహాయ అధ్యక్షుడు దోసపాటి శ్రీనివాస్, కోశాధికారి పోలోజు నాగేందర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివాజీనగర్‌లో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జనగణన ఉత్సవ సమితి సభ్యులు పోలా జనార్ధన్, అలుగుబెల్లి శ్యాంసుందర్‌రెడ్డి, మహేష్, లక్ష్మీనారాయణ, గడ్డం మహేష్, అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి రేఖ, భూపతి రాజు, గుంటి రామకృష్ణ, సైదులు, ఆగు రాజు, లింగస్వామి తదితరులు ఉన్నారు.



చిట్యాల: ఆరెగూడెంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు

● నాంపల్లిలో శివాజీ ఉత్సవ కమిటీ సభ్యుడు పానగంటి మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివాజీ ఉత్సవ సమితి సభ్యులు బిరుదోజు భరత్‌కుమార్, మోర సాయి, కస్తూరి మహేష్, పానగంటి శంకర్‌గౌడ్, కామిశెట్టి శివ, పాల హరీష్, వివిధ పార్టీల నాయకులు వడ్లకొండ రమేష్, కామిశెట్టి యాదయ్య (ఛత్రపతి), చిరుమామిళ్ల గిరిబాబు, మట్టిపల్లి శ్రీశైలం, నాంపల్లి సతీష్, మేకల శ్రీకాంత్, పొలగోని శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో హిందువాహిని ఇతర సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందువాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట రాజు, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, మేడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, నాగరాజు, గణేష్, శ్రవణ్‌కుమార్, స్వామి, మహేష్, రామలింగం, నాగరాజు, రమేష్, వెంకట్, శివ, రామలింగం పాల్గొన్నారు.

● చిట్యాలమండలంలోని ఆరెగూడెం, గుండ్రాంపల్లి గ్రామాల్లో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగంపల్లి శ్యాంసుందర్, భూతాల భిక్షపతితో కలిసి శ్యాంసుందర్ మాట్లాడారు. కార్యక్రమంలో పిండె ఆంజనేయులు, మురాల రామలింగస్వామి, నాగంపల్లి కిషోర్, నర్సింహ, బేంబిరి శ్రీనివాస్, నార్సింగ్ రాజు, నర్సింహ, చిన్నవెంకట్‌రెడ్డి, అంజయ్య, మారయ్య, సాయిలు, మధుసూధన్, నర్సింహ, సురేష్, శేఖర్, సైదులు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వేగంగా ఉపాధి హామీ పనులు

బి.శ్రీనివాసరావు, ఎంపీడీవో



మండలంలోని 16 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫీడర్ ఛానళ్లు, భూమి అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

● (కేతేపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలోని ఎన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి?

ఎంపీడీవో: మండలంలోని 16 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఈజీఎస్‌లో ప్రస్తుతం ఏఏ పనులు జరుగుతున్నాయి?

ఎంపీడీవో: ఉపాధి హామీ నిబంధనల మేరకు ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఫీడర్ ఛానళ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. గుడివాడలో భూమి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఆయా గ్రామాల్లో సాగుతున్న ఉపాధి పనుల్లో ఎంత మంది కూలీలు పాల్గొంటున్నారు?

ఎంపీడీవో: సగటున గ్రామానికి 53మంది చొప్పున మొత్తం 640 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: కూలీలు చేసిన పనికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా?

ఎంపీడీవో: క్షేత్రస్థాయి సిబ్బంది ఏ రోజుకారోజు కూలీలు చేసే పనుల కొలతలు నమోదు చేసిన మేరకు నెలనెలా వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి.

నాటిన మొక్కలను కాపాడాలి : ఎంపీడీవో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి లక్ష్మి

శాలిగౌరారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వస్తున్నందున నాటిన మొక్కలను బతికించడానికి నీరు పోసి కాపాడాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలు మొలకెత్తి ఉండాలన్నారు. హెడ్ నెట్, ప్రైమరీ బెడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి చివరి వరకు కూలీలకు బడ్జెట్ పూర్తి చేయాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో అల్లూరి పద్మ, ఏపీవో జంగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కనగల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషించారు. తోటి విద్యార్థులకు తరగతి గదుల్లో పాఠాలను బోధించారు. పాఠశాల విధులను చక్కగా నిర్వర్తించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, టీచర్లు రోహిణి, సంధ్య, కల్పన, మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో ఆపదమిత్ర వలంటీర్ల పర్యటన



క్షేత్రపర్యటనలో పాల్గొన్న వలంటీర్లు

కనగల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతగిరి గ్రామంలో బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వలంటీర్లు క్షేత్ర పర్యటన చేపట్టారు. శిక్షణలో భాగంగా ఆపద సమయంలో చేపట్టే సహాయక చర్యలను ఫీల్డ్ కో ఆర్డినేటర్లు (ఎంపీవో) సుమలత, వెంకటేశ్వర్లు వలంటీర్ల బృందానికి వివరించారు. గ్రామంలో అందుబాటులో గల వనరులను తదితర అంశాలను వలంటీర్ల బృందం సభ్యులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీసీ వసంత, వీబీకే యమున, వలంటీర్లు ఆదిమళ్ల సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మండల ప్రత్యేకాధికారి ఎం. వీరప్ప



ఎస్టీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఎం.వీరప్ప

గట్టుప్పల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో మెనూను ఖచ్చితంగా పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.వీరప్ప అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌ను ఎంపీడీవో, తహసీల్దార్లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్‌లో ఉన్న వంట గదిని, వాటర్ ఫిల్టర్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూను ఖచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకూడదని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాములు, ఎంపీడీవో మాధవరెడ్డి, మండల అధికారులు ఉన్నారు.

వాట్సప్ కలిపింది నాటి మిత్రులను..

● మిత్రులను చేరువ చేస్తున్న సోషల్‌మీడియా

● గెట్ టు గెదర్‌లో కలుస్తున్న ఆనాటి విద్యార్థులు



2003 -04 సంవత్సరంలో 10వ తరగతి చదివిన నాంపల్లి విద్యార్థులు (ఫైల్)

నాంపల్లి, ఆంధ్రజ్యోతి: వాట్సప్ అందరినీ కలుపుతోంది. విడిపోయిన వారిని దగ్గర చేస్తోంది. ఎప్పుడో చిన్నతనంలో చదువుకునే సమయంలో విడిపోయిన మిత్రులు మళ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అంటూ కలుస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తర్వాత ఏ ఫోన్‌లో చూసిన పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ బ్యాచ్, ఫ్యామిలీ గ్రూపులు క్రియేట్ చేసుకొని గ్రూప్ కాల్స్ మాట్లాడుతూ మంచి, చెడులను తెలుసుకుంటున్నారు. ఫంక్షన్లకు, గెట్ టుగెదర్ పార్టీలకు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు ఉదయం లేవగానే దోస్తులు, ఫ్యామిలీ గ్రూపులలో గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్‌లు చెబుతూ అందరినీ పలకరిస్తున్నారు. గతంలో గ్రామాల్లో ల్యాండ్‌ఫోన్లు, సెల్‌ఫోన్‌లు లేని సమయంలో సొంత గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకొని అనంతరం మండల కేంద్రాల్లో ఉన్న జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి అక్కడ 10వ తరగతి వరకు విద్య అభ్యసించేవారు. అక్కడ చదువుతున్న సమయంలో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తుండటంతో వారు ప్రాణ స్నేహితులుగా ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంతంగా స్నేహం ఏర్పడేది. 10వ తరగతి అనంతరం చదవాలంటే జిల్లా కేంద్రానికో, హైదరాబాద్ లాంటి మహానగరాలకు వెళ్లి చదువుకునేవారు. చదువు, ఉద్యోగం, ఉపాధి కోసం సొంత గ్రామాలను వదిలి ఇతర ప్రాంతాల కుటుంబంతో వెళ్లేవారు. తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవాలని వారితో కబర్లు చెప్పుకోవాలని ఎంతో ఆశగా ఉన్నా ఆ రోజుల్లో ఫోన్లు, మొబైల్స్ లేకపోవడం వల్ల అది వారికి వీలుకాకపోయేది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తర్వాత దోస్తులు ఒకరికి ఒకరు కలుసుకుంటూ గెట్ టు గెదర్ వంటి ప్రోగ్రాంలు చేసుకుంటున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానిస్తూ తోటి స్నేహితులు ఆపద, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు వేసి ఆర్థిక సహాయం చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. సోషల్ మీడియా వల్ల ఎంత నష్టం ఉందో తెలియదుగాని 30, 40 ఏళ్ల క్రితం విడిపోయిన దోస్తులను కూడా ఒక వేదికపైకి తీసుకువచ్చి వారి సంతోషం, సుఖాల్లో వాట్సప్ ప్రాముఖ్యత ఎంతో ఉంది.

హాస్టల్‌లో విడిపోయి వాట్సప్‌లో కలిశాం



దేవరకొండలోని గురుకుల పాఠశాలలో 1990-91 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసి అనంతరం పై చదువుల కోసం నల్లగొండ, హైదరాబాద్‌కు వెళ్లి చదువుకున్నాను. 10వ తరగతిలో విడిపోయిన స్నేహితులు 20 ఏళ్ల తర్వాత వాట్సప్ గ్రూపుల్లో కలుసుకున్నాం. ఈ వాట్సప్ వల్లే 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

● బాషిపాక జయశ్రీ, సుంకిశాల

ఫ్రెండ్ ఫంక్షన్‌లో కలిశాం



నాగార్జునసాగర్‌లో 2000-01 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకొని కుటుంబ పరిస్థితులు బాగా లేక హైదరాబాద్‌లో పనికి చేరాను. 15 సంవత్సరాల తర్వాత మా దోస్తులు వాట్సప్ గ్రూపు క్రియేట్ చేసి తెలిసిన వారు నా నెంబర్ యాడ్ చేశారు. 18 సంవత్సరాల అనంతరం మిత్రుని కుమార్తె ఫంక్షన్‌లో కలిసి దోస్తులతో సంతోషం పంచుకున్నాను.

● ఆక కిరణ్, నేరెళ్లపల్లి

గురుకుల పాఠశాల మంజూరు చేయించాలి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలో గురుకుల పాఠశాలను మంజూరు చేయించాలని కోరుతూ గురుకులాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదె లింగ్వామి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నల్లగొండ పట్టణంలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం లింగస్వామి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ పేద, సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించేందుకు గురుకుల పాఠశాల ఎంతో అవసరమని, మండలానికి గురుకులం మంజూరైతే ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా పోటీ పరీక్షలకు అనుకూలంగా ఉండేందుకు గ్రంథాలయాలను ఆధునీకరించాలని, అదేవిధంగా మండలంలో జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సభలు, సమావేశాలను నిర్వహించుకునేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్, మహాత్మా జోతీబా పూలే భవన్‌ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● ఎన్‌సీపీసీఆర్ సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న అంజన్‌రావు

మర్రిగూడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎన్‌సీపీసీఆర్) పొనుగోటి అంజన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని 10 జీపీఏ సాధించాలని సూచించారు. 100శాతం ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ సర్వూపరాణి, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, బాలరాజు, రమేష్ ఉన్నారు.

నిధుల నిర్వీర్యంపై ఆగ్రహం

పాఠశాల అభివృద్ధి కోసం మంజూరైన 2023-24, 2024-25 పీఎంపీ నిధులు నిర్వీర్యం కావడంతో ఎన్‌సీపీసీఆర్ సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా అంజన్‌రావు పలు రికార్డులను తనిఖీ చేశారు. 2023-24, 2024-25 సంవత్సరానికి గాను పాఠశాలకు సంబంధించిన నిధులు రూ.8లక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ ఎలాంటి సమాధానం చెప్పక పోవడంపై ఆమె పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. నిధులను ఎందుకు డ్రా చేయలేదని వాటిని పాఠశాల అభివృద్ధి కోసం ఎందుకు ఉపయోగించుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు అంతర్గత విబేధాలను వదిలేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని అన్నారు. త్వరగా ఈ ఏడాది మంజూరైన నిధులను డ్రా చేసి పాఠశాల మౌలిక వసతులకు ఉపయోగించాలన్నారు. ఉపాధ్యాయుల పనితీరు మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. తనకు హాజరు శాతం తక్కువైనందున మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రూ.5వేలు ఇస్తేనే ఇంటర్ ప్రాక్టికల్ రాయిస్తానని డిమాండ్ చేసినట్లు ఓ విద్యార్థి ఆరోపించాడు. ఈ విషయంపై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివస్వరూపరాణిని వివరణ కోరగా మేము ఎవ్వరినీ డబ్బులు ఇవ్వమని అడగలేదని, హాజరు శాతం తక్కువ ఉన్నందున రెగ్యులర్‌గా వస్తేనే పరీక్షలు రాయిస్తానని చెప్పినట్లు తెలిపారు.

న్యాయవాదులు ఒత్తిడికి గురి కావొద్దు

మిర్యాలగూడ లీగల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు నిత్యం కేసులతో ఒత్తిడికి గురి కావొద్దని మిర్యాలగూడ కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి. వేణు సూచించారు. హైకోర్టు న్యాయవాది పసునూరి వేణు గోపాల్‌రావు సంతాప సభ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కోర్టు హాల్‌లో బుధవారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాలతో కలిసి పాల్గొని జడ్జి వేణు మాట్లాడారు. న్యాయ వాదు లు కేసులను కేసు లాగే చూడాలని, ఎలాగైనా గెలవాలనే తపనలో వ్యక్తి గతంగా తీసుకొని ఒత్తిడికి లోనై మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. హైకోర్టులో మంగళవారం మృతిచెందిన న్యాయవాది వేణుగోపాల్‌రావు గతంలో మిర్యాలగూడ కోర్టులో న్యాయవాదిగా పనిచేసి అందరి మన్ననలను పొందా రన్నారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, విధు లకు న్యాయవాదులు దూరంగా ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ వేణు గోపాల్‌రెడ్డి, ఏజీపీ గోదల వెంకట్‌రెడ్డి, స్పెషల్ ఏజీపీ మట్టపల్లి శ్రీధర్ గౌడ్, న్యాయవాదులు కె.ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 19 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని చిన్నకాపర్తికి చెందిన కట్టెల లింగస్వామి అనారోగ్యంతో ఇంటి వద్ద ఇశ్రాంతి తీ సుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పా ర్టీ జిల్లా నాయకుడు కంచర్ల వెంకట్‌రెడ్డి బుధవారం అయన్ను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన రూపని వెంకన్న మృతి చెందగా కుటుంబ సభ్యులను పరిమర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెద్దకాపర్తిలో చేపూరి బాబూరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆ కుటుంబానికి గ్రామస్థుడు మర్రి గోపాల్‌రెడ్డి పరామర్శించి రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాబూరావు కుమార్తెల విద్యాభ్యాసానికి తాను అండగా ఉంటానని మనోధైర్యాన్ని కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో బోయపల్లి వెంకన్న, రుద్రారపు శ్రీను, పాలకూరి వెంకటేష్‌గౌడ్, మామిడి నగేష్‌గౌడ్, మామిళ్ల దానయ్య, రుద్రారపు లక్ష్మణ్, దేశపాక శ్రవణ్, చుక్క గణేష్, మామిళ్ల దానయ్య, పెరిక ఈశ్వరయ్య, చిలివేరు కృష్ణ, శ్రీకాంత్, భిక్షం, నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం : ఎంఈవో

శాలిగౌరారం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈవో మందుల సైదులు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు మొదటి నుంచి ప్రణాళికాబద్ధంగా బోధించి సిలబస్ పూర్తి చేశాం. ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలో 29 ప్రాథమిక పాఠశాలలు, 1 యూపీఎస్ 11, జడ్పీ స్కూల్, 1 మోడల్ స్కూల్, 1 కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, 2 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో సుమారు 242 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికి 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

పదవ తరగతి విద్యార్థులకు మొదటి నుంచి ప్రత్యేక బోధన, తరగతులు ఏర్పాటు చేస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని విద్యలో ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలపై దృష్టి పెట్టాం.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 20 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 19.0

మహాకుంభాభిషేకానికి శ్రీకారం



స్వామికి మొక్కుతున్న భక్తురాలు

యాగశాలలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు



అగ్ని ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు బుధవారం స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, రుత్వికుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై 10 గంటల వరకు కొనసాగింది.

● ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్

7

నెలవారంతో నాలుగోరోజు పూర్తి

పెద్దగట్టుపై భక్తుల రద్దీ



సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని పెద్దగట్టు జాతర సందర్భంగా లింగమంతులస్వామిని దర్శించుకునేందుకు భక్తుల రాక కొనసాగుతోంది. జాతరలో నాలుగో రోజైన బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారంతో జాతర పరిసమాప్తం కానుంది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)



6

ఆలయంలో లింగమంతుల స్వామి



ఉదయం నల్లగొండలో జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు

మంచు.. ఎండ.. చలి

ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఈ నెల మూడో వారం నుంచి వాతావరణంలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నెల మొదటి వారం నుంచే ఎండలు దంచి కొడుతుండగా, వారం రోజులుగా తెల్లవారుజామున పొగమంచు కురుస్తోంది. ఉదయం 10గంటల నుంచే భానుడి భగభగలు, సాయంత్రం కాస్త చల్లటి గాలులతో కూడిన వాతావరణం ఉంటోంది. బుధవారం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పొగమంచు కప్పేసింది. దీంతో రాష్ట్ర, జాతీయ రహదారులపై వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంచు కారణంగా నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఉదయం 8గంటల వరకు మంచు తెరలు తొలగిపోలేదు. వాహనదారులు లైట్లు వేసుకొని నడిపే పరిస్థితి ఏర్పడింది. వారం రోజులుగా ఉష్ణోగ్రతల్లో హెచ్చు, తగ్గులు ఉంటున్నాయి. వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. ఈ నెల చివరి వారంలో పొడి వాతావరణంతో పాటు పొగ మంచుతో కూడిన వాతావరణం ఉండే అవకాశం ఉంది. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రత 19.0డిగ్రీలు ఉండగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 34.0డిగ్రీలుగా నమోదైంది. 10గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండుతున్న ఎండలతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. పగలు మండే ఎండలు, రాత్రి కాస్త ఉక్కపోత, అర్ధరాత్రి నుంచి చల్లటి వాతావరణం ఉంటోంది. శివరాత్రి వరకు చలిగాలులు ఉండనున్నాయి.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
13	20.0	33.2
14	20.4	32.0
15	20.0	33.5
16	19.0	33.5
17	19.4	34.0
18	19.8	34.5
19	19.8	34.0

మద్యం విక్రయాలపై మహిళల దండోరా



మద్యనిషేధంతో ఏపూరులో మూతపడిన ఓదాబా హోటల్

మద్యం విక్రయాలపై ఆ గ్రామ మహిళలు దండోరా మోగించారు. గ్రామానికి చెందిన యువకుడు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అతడి మరణం అందరినీ కలచివేసింది. అతడి కుటుంబానికి వచ్చిన కష్టం గ్రామంలోని మరే కుటుంబానికి రావొద్దని మద్యం విక్రయాలపై మహిళలు తిరగబడ్డారు. అంతా తీర్మానించుకొని బెల్టుషాపులన్నింటినీ మూసేయించారు. దాబాల్లో సిట్టింగులు నడపవద్దని, మద్యం విక్రయిస్తే రూ.లక్ష, తాగితే రూ.20వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మద్యం విక్రయించినవారిని పట్టిస్తే రూ.10వేల నజరానా కూడా ప్రకటించారు. గ్రామంలో దండోరా వేసి మరీ నిషేధం ప్రకటించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఏపూరులోనే విచ్చలవిడిగా మద్యం విక్రయాలు ఎందుకు సాగాయి? చిన్న గ్రామంలో లెక్కకు మించి బెల్టు దుకాణాలెందుకున్నాయి? పొరుగున ఉన్న మునుగోడు నియోజకవర్గంలో మద్యం నిషేధ ప్రభావం ఎలా చూపిందనే అంశాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- ఓ యువకుడి మరణంతో కదిలిన ఊరు
- ఏపూరు గ్రామంలో నిషేధం విధిస్తూ తీర్మానం
- 13 బెల్టుషాపులను గుర్తించి విక్రయాల నిలిపివేత
- విక్రయిస్తే పోలీసులకు పట్టిస్తామని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి పరిశీలన

జాతీయ రహదారికి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపూరు గ్రామంలో 650 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి సమీపంలో పరిశ్రమలు ఏర్పాటవడం, రవాణారంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండడంతో గ్రామానికి చెందిన యువత ఎక్కువగా డ్రైవర్లుగా స్థిరపడ్డారు. ఊరికి చెందిన 350 మంది డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ ఊళ్లో వ్యవసాయం, కులవృత్తులు ఉండగా, డ్రైవర్లుగా పనిచేసి ఆర్థికంగా స్థిరపడ్డారు. ఐదారేళ్ల క్రితం వరకు పండగలు, పబ్బాలప్పుడు సంప్రదాయాల ప్రకారం పరిమితికి లోబడి కల్లు, మద్యం సేవించడం మిగతా 7వ పేజీలో...



మద్యం విక్రయాలు చేయవద్దని ఓ దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఏపూరులోనే కాదు, జిల్లాలో ఎక్కడైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. అక్రమంగా సిట్టింగులు నిర్వహించే విషయం మా దృష్టికి తీసుకువస్తే దాడులు చేసి, నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎవరూ అక్రమంగా మద్యం విక్రయించవద్దు. ఎక్కడైనా మద్యం అక్రమ విక్రయాలు జరుగుతుంటే మాకు తెలియజేయాలి. ఏపూరులో స్వచ్ఛంద మద్యనిషేధ నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. ప్రజల్లో చైతన్యం రావడం సంతోషదాయకం.

సంతోష్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నల్లగొండ

బెల్టుషాపు నిర్వాహకులకు నోటీసులు

ఏపూరులో మహిళల నిర్ణయం మేరకు గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించిన వారందరికీ నోటీసులు జారీ చేశాం. ఒక్క మద్యం సీసా విక్రయించినట్లు తెలిసినా చట్టపర చర్యలుంటాయని తెలియజేశాం. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా మద్యం విక్రయిస్తే పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి చట్టపర చర్యలు కోరుతాం.

మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పథకాలు, వనరులు, బోర్లు, నల్లా కనెక్షన్‌లు, మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు, పైపులైన్ల మరమ్మతులు, వేసవి కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిర్యాలగూడ డంపింగ్ యార్డ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో శర్మ, తహసీల్దార్ హరిబాబు, ఈఈ వెంకన్న, అసిస్టెంట్ ఇంజనీర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



దామరచర్ల కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

బాలికలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మిర్యాలగూడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమం కింద 'కౌమార బాలికల రుతుస్రావం, వ్యక్తిగత శ్రద్ధ' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే ఎదుగుదల సాధ్యమవుతుందని, అంతేగాక రుతుస్రావం, పునరుత్పత్తి ఆధార పడి ఉంటాయన్నారు. కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, పాల్గొన్నారు.

ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం వాడపల్లిలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని ఆమె దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. కృష్ణా నదిలో లోతట్టు ప్రాంతాల్లో నీరు ఉన్నందున భక్తులకు స్నానం ఆచరించేందుకు ఇబ్బంది అవుతుందని, షవర్ బాత్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి కొరత లేకుండా చూడాలని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య శిబిరం, పోలీస్ బందోబస్తు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను, మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ పూజిత ఫర్టిలైజర్ దుకాణాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవసాయం యోగ్యం కాని సర్వే నెంబర్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. రైతు భరోసా, ఎరువుల సరఫరాపై మండలాధికారి కార్యాలయంలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ జవహర్‌లాల్, వాడపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఏఈ జ్యోతి, అనువంశిక ధర్మకర్త సిద్దయ్య ఉన్నారు.

'రైతు భరోసా'పై ఫిర్యాదులు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): రైతు భరోసాపై ఫిర్యాదుల స్వీకరణకు అన్ని మండల వ్యవసాయాధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, వ్యవసాయ యోగ్యంకాని భూముల వివరాలను శనివారంలోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. రైతు భరోసా ఫిర్యాదుల తీసుకొని సోమవారంలోగా వాటన్నింటినీ పరిష్కరించాలన్నారు.

రైతుల గురించి బీఆర్‌ఎస్ మాట్లాడటం హాస్యాస్పదం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా పెద్దగట్టు జాతరలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

•6లో..

మిర్చికి మద్దతు ధర కల్పించాలి



కల్లేపల్లిలో మిర్చి దిగుబడిని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

దామరచర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన మిర్చికి ప్రభుత్వం మద్దతు ధర రూ.25వేలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కల్లేపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్చి ధర దారుణంగా పడిపోయిందని, గత ఏడాది క్వింటా ధర రూ.25వేలు ఉండగా, ప్రస్తుతం రూ.12వేలకు తగ్గడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలని, మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మిర్చికి రూ.15వేలు మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చి నేటికీ అమలుచేయలేదని, వెంటనే మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, వినోద్‌నాయక్, ఎర్రనాయక్, దయానంద్, మాలునాయక్, సైదా, సక్కు, మంగ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● హిందూవాహిని ర్యాలీ



ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని నాయకులు, కార్యకర్తలు

•8లో..

ఆర్థికంగా మూడో స్థానంలో దేశం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశం అన్ని సమస్యలు అధిగమిస్తూ ప్రపంచంలో ఆర్థికంగా మూడో స్థానంలోకి నిలిచిందని ఐసీఎస్ఎస్ ఆర్ఆర్ఎస్ ఆర్సీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీ కళాశాలలో 'సుస్థిర అభివృద్ధి, సమస్యల పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇలాంటి అంశాలపై జాతీయ సెమినార్లు నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ, పేదరికం, అసమానతలను అంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. సదస్సులో ప్రొఫెసర్లు ఫరీదా బేగం, ఆకుమర్తి నాగేశ్వరరావు, మౌలానా, ఎం.రాములు, దయాకర్, మునిస్వామి, ఆది మల్లేశం, కిరీటం, నర్సింగ్ కోటయ్య, హబీ, అంకుష్, దినేష్, అనిల్‌కుమార్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

'రైతు భరోసా'పై ఆందోళన వద్దు : ఏవో సరిత

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెట్టుబడిసాయం కింద రైతులకు అందిస్తున్న రైతు భరోసాపై ఆందోళన చెందవద్దని ఏవో గుర్రం సరిత అన్నారు. స్థానిక రైతువేదికలో బుధవారం రైతు భరోసాపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసాపై రైతులకు ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో రావుల నరేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే మత్స్యకారుల అభివృద్ధి

వేములపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. బుధవారం వేములపల్లి చిన్నచెరువు కట్టపై రాకపోకలకు ఇరువైపుగా ఇబ్బందిగా ఉన్న కంప చెట్లను ఆయన సొంత ఖర్చులతో జేసీబీతో తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం చైర్మన్ పందిరి శ్రీనివాస్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులు ఒత్తిడికి గురి కావొద్దు



మౌనం పాటిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

మిర్యాలగూడ లీగల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు నిత్యం కేసులతో ఒత్తిడికి గురి కావొద్దని మిర్యాలగూడ కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి. వేణు సూచించారు. హైకోర్టు న్యాయవాది పసునూరి వేణు గోపాల్‌రావు సంతాప సభ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కోర్టు హాల్‌లో బుధవారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాలతో కలిసి పాల్గొని జడ్జి వేణు మాట్లాడారు. న్యాయ వాదులు కేసులను కేసు లాగే చూడాలని, ఎలాగైనా గెలవాలనే తపనలో వ్యక్తిగతంగా తీసుకొని ఒత్తిడికి లోనై మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. హైకోర్టులో మంగళవారం మృతిచెందిన న్యాయవాది వేణుగోపాల్‌రావు గతంలో మిర్యాలగూడ కోర్టులో న్యాయవాదిగా పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, విధులకు న్యాయవాదులు దూరంగా ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ వేణు గోపాల్‌రెడ్డి, ఏజీపీ గోదల వెంకట్‌రెడ్డి, స్పెషల్ ఏజీపీ మట్టపల్లి శ్రీధర్ గౌడ్, న్యాయవాదులు కె.ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. అనుముల మండలం పంగవానికుంటకు బైరు చెన్నయ్య ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా కింద రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును చెన్నయ్య కుటుంబ సభ్యులకు బుధవారం మాజీ ఎమ్మెల్యే భగత్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీలు ఉర్లగొండ వెంకటయ్య, మలిగిరెడ్డి వెంకట్‌నారాయణరెడ్డి, మలిగిరెడ్డి రాంరెడ్డి, పిట్టల సైదులు, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఇక్కట్లు

▸ లోవోల్టేజీతో చందంపేట మండలంలో ఎండుతున్న మిర్చి పంట ▸ సమస్య పరిష్కరించాలని వేడుకోలు



చందంపేట మండలం పొగిళ్లలో నీరు అందకపోవడంతో ఎండిపోతున్న మిర్చిపంట

చందంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్‌దేవరపల్లి, కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల్లో రైతులు విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాల్లో సరైన విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొగిళ్ల గ్రామంలో 200 ఎకరాలు నాగార్జునసాగర్ వెనుక జలాల నుంచి దాదాపు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో పైపులు వేసి మోటర్ల ద్వారా మిర్చి సాగు చేస్తున్నారు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్ కావడతో ఎక్కువ మోటర్లు నడవడం, సామర్థ్యానికి మించి మోటర్లు నడవడంతో సరైన విద్యుత్ అందక మోటర్లు నీరు పోయకపోవడం, కాలిపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు కనీసం పెట్టుబడులు కూడ వచ్చే పరిస్థితులు లేవని వాపోతున్నారు. కంబాలపల్లిలో 100 ఎకరాలు సాగవుతుండగా లోవోల్టేజీ సమస్య వెంటాడుతోంది. ఈ విషయమై రైతులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యను పరిష్కరించడం లేదని తెలుపుతున్నారు. అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్‌ఏఈ ఏమన్నారంటే.. కంబాలపల్లి, పొగిళ్ల రైతులు లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్న విషయం నిజ మేనని, త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



మూడు ఎకరాల్లో మిర్చిసాగు చేశాను. అరకొర విద్యుత్, దీనికి తోడు లోవోల్టేజీ సమస్యతో పంటకు సరిపడా నీరు అందడం లేదు. దీంతో మిర్చి పంట తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్ప డింది. అధి కారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలను కాపాడాలి.

-జటావత్ రవి, పొగిళ్ల

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల రికార్డులు పరిశీలన

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి ఇంటర్నల్ మార్కులను రికార్డులను మానిటరింగ్ బృందం బుధవారం పరిశీలించింది. మండలకేంద్రంలోని శ్రీ సాయి కృష్ణవేణి పాఠ శాల, వదిపట్ల జడ్పీఉన్నత పాఠశాల, పుట్టంగండి డీఏవీ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసింది. బృందంలో సాగర్, శ్రీనివాస్‌రావు, జీవన్‌కుమార్ ఉన్నారు.

ఉత్సవాలు సంప్రదాయాలకు ప్రతీక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తదితరులు

హాలియా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జాతర సంప్రదాయాలకు ప్రతీక అని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు పేరూరు గ్రామ స్వయం భూసోమేశ్వ రస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు 26న శివరాత్రి జాగరణ, 27న స్వామి దివ్య కలాణ మహోత్సవం నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రిక్కల కొండా రెడ్డి తెలిపారు. ఉత్స వాల్లో భాగంగా 26,27,28 తేదీల్లో జిల్లా గ్రామీణ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, గౌని రాజా రమేష్‌యాదవ్, యడవల్లి రాంబాబు, శ్రీను, నర్సింహ, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



గుడిపల్లిలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు.

పెద్దఅడిశర్లపల్లి,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గుడిపల్లి మండలకేంద్రంలో బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్వామివారికి, మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన వారిలో సేవాలాల్ మహరాజ్ ఒకరన్నారు. కార్యక్రమంలో కొర్ర బాలకృష్ణ చౌహన్, రమావత్ రమేష్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీను నాయక్, తహసీల్దార్ మధుహాసిని, ఎంపీడీవో సకినాల పద్మ, కార్యదర్శి నవీన్ నాయక్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మునగాల అంజిరెడ్డి చంద్రారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ బూతం సైదులు, శీలం శేఖర్‌రెడ్డి, నర్సింహ, యాదగిరి పాల్గొన్నారు.

చేయూత

వేములపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన ఈశ్వరి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో మిర్యాలగూడ పట్టణంలోని అభ్యాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు రూ.10 వేలు అందజేశారు. విద్యార్థులు చేసిన సహకారానికి పాఠశాల చైర్‌పర్సన్ వంగాల పుష్పలతానిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్‌లోడ్ విధానాన్ని రద్దు చేయాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న పని ప్రదేశంలో తీసే ఫొటోలు ఉదయం, సాయంత్రం ఫోన్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని రద్దు చే యాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొల్ ముంతలపహాడ్ గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీల పని ప్రదేశానికి వెళ్లి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రోజు కూలి రూ.600కు పెంచాలని అన్నారు. ఆయన వెంట వెంకటయ్య, కూలీలు తదితరులున్నారు.

గొప్ప పరిపాలనాదక్షుడు శివాజీ మహరాజ్

హాలియా ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ స్వశక్తితో మరాఠ సామ్రాజాన్ని స్థాపించిన మహనీయుడు గొప్ప పరిపాలనాదక్షుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని అన్నారు. హాలియాలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్యక్షత్రియ సంఘం అధ్యక్షుడు ముజ్జా శ్రీహరి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి హాలియా ప్రధానవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షుడు చిందె లక్ష్మణ్‌రావు, గౌరవ అధ్యక్షుడు శివన్నారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, వడ్డె సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

● దేవరకొండ : పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయం నుంచి బస్టాండ్ వరకు శివాజీ యువదళ్ నేతలు, బీజేపీ నాయకులు భారీగా నిర్వహించారు. అంజయ్య కాలనీలో శివాజీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, నక్క వెంకటేష్ యాదవ్, సుధాకర్, అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.



హాలియా ర్యాలీలో పాల్గొన్న శివాజీ యూత్, తదితరులు

● కొండమల్లేపల్లి : మండలకేంద్రంలో డప్పు చప్పుళ్లు, కోలాట బృందాల కోలాహలం నడుమ శోభాయాత్రను నిర్వహించారు. అంతకుముందు శోభాయాత్రను ఎస్ఐ రామ్మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏటి కృష్ణ, శేఖర్ యాదవ్, భరత్‌కుమార్, పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అంగడిపేట గ్రామ శివారు వరకు డీజే సౌండ్‌తో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్జెల చిత్తరంజన్ రెడ్డి, గోపిడి కిషన్‌రెడ్డి, వంగాల అమరేందర్ రెడ్డి, పున్న విజేందర్ పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : నందికొండలో మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరెకటిక సంఘం సభ్యులు ఈశ్వర్‌జీ, రవి, రాము, రాజు పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలకేంద్రంలో బీజేపీ నాయకులు శివాజీ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మండలాధ్యక్షుడు సముద్రాల నగేష్, వెన్నం శేఖర్, నాయకులు శివర్ల రమేష్ యాదవ్, బొడ్డు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు మద్దతుగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తంరావు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తంరావు కోరారు. పూల రవీందర్‌ను గెలిపించాలని కోరు తూ స్థానిక మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల భారత హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్ కు మార్ సంఘం జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్య క్షుడు వాసుదేవుల వెంకట్‌నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నేతి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పందిరి వేణు, పట్టణాధ్యక్షుడు కంచి సత్యానారాయణ, లక్ష్మీనారాయణ, రమేష్, చాపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజల్లో పాల్గొన్న మానుమాన్ మాలధారులు

హాలియా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలో స్వయంభూ భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం బ్రహ్మశ్రీ నంది వెలుగు బాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, హనుమాన్ వ్రతం, సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మేడేపల్లి మోహన్‌రావు, పారిశ్రామిక వేత్త చిట్టిపోలు యాదగిరి, పుర ప్రముఖులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, కుందూరు వెంక ట్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, పేలపూడి బాలకృష్ణ, వీరమళ్ల శ్రీనివాస్, గౌని రాజారమేష్‌యాదవ్, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో కాకతీయ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లోమిర్యాలగూడ పట్టణంలోని కాకతీయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో నంద్యాల సాత్వికొరెడ్డి రాష్ట్రస్థాయి ద్వితీయ ర్యాంక్, నల్ల సాయిరోహిత్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు, కట్టా వెంకటేశ్వరరెడ్డి, గార్లపాటి శ్రీకర్ రెడ్డి జిల్లా ఫస్ట్ ర్యాంకులు, పత్తిపాటి తన్వీ, ఉబ్బపల్లి మహేష్‌చంద్ర, గుండ్ల హర్షవర్ధన్‌రెడ్డి, కే.విహార్ జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు సన్మానించి అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పట్టణానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ గుండా హరి నాయణ, డైరెక్టర్ చీదళ్ల వెంకట్, ప్రిన్సిపాల్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీపీవో

వేములపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఏ ఒక్కరూ నిరక్ష్యంగా వ్యవహరించిన చర్యలు తప్పని డీపీవో వెంకయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపడుతూ డంపింగ్‌యార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను ఎప్పటికప్పుడు సంరక్షించి గ్రామాల్లో పారిశుధ్య వాతావరణం నెలకొనేలా చూడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి శ్రవణ్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నిడమనూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు మల్లికంటి చంద్రశేఖర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సే నో టు డ్రగ్స్ అనే ప్రచారంతో కూడిన క్యాలెండర్లను బుధవారం మండలంలోని ముకుందాపురంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు లెంకల పరిపూర్ణాచారి, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌కు సన్మానం

చింతపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)కు చెందిన టీడీపీ మండలా ధ్యక్షుడు ఉప్పల రమేష్‌ను బుధవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బక్కిని నరసింహులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం సంతరించడానికి తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, కసిరెడ్డి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరుడు గిరిబాబుకు నివాళి

నిడమనూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుడు పిల్లి గిరి బాబు 11వ వర్థంతి మండలంలోని ముకుందాపురం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాల నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల వెంకట్‌రెడ్డి, కేశ శంకర్, వంగాల వెంకన్న, జానిమియా, వెంకటయ్య, పిల్లి రాములు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్



మిర్యాలగూడ : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, శవిదర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊడిగెం చేసేలా రైతు, కార్మిక, కూలీల, మహిళల, విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో అయితగాని విష్ణు, తంగెళ్ల నాగమణి, చింతచర్ల శ్రీను, పిండి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, వెంకట్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

నాగార్జునసాగర్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సాగర్ హైలాన్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వపరి పాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజకీయ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయుల వేష ధారణలో పాఠశాలకు హాజరయ్యారు. సాయ ంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదాన చేశారు. కార్యక్ర మంలో హెచ్ఎం జయమ్మ, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



సాగర్ హైలాన్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు